సాక్షి పెద్దపల్లి

శనివారం । 8 ఏప్రిల్ । 2023



రాజన్నకు జనహారతి

వేములవాడ: రాజన్నను శుక్రవారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలకు వరుస సెలవులు రావడంతో భక్తుల తాకిడి పెరిగింది



ధర్మపురి కాషాయమయం

ధర్మపురి: కొండగట్టు శ్రీఆంజనేయస్వామిని దర్శించుకున్న భక్తులు.. శుక్రవారం ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

గరిష్టం/కనిష్టం 35.0/23.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటిపూట ఉక్కపోతగా ఉంటుంది. ఎండ తీవ్రత పెరుగుతుంది.

దైవం దృష్టిలో రాజు రైతు, ధనిక పేద, కులం మతం, జాతి, వర్గ బేధాలు లేవు.
– మహమ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
శని 6:34	ఆది 4:39

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

ఎన్టీపీసీలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



హెల్త్‌వాక్‌లో అధికారులు, ఉద్యోగులు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ ధన్వంతరి హాస్పిటల్, రామగుండం స్పందన క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని హెల్త్ వాక్ నిర్వహించారు. నడక ఉదయం గం.6.30 గంటలకు స్పందన క్లబ్ నుంచి ప్రారంభమై టౌన్‌షిప్ రింగ్ రోడ్డు చుట్టూ ఒక రౌండ్ పూర్తి చేసి క్లబ్‌లో ముగించారు. ఈ వాక్‌లో ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, యూనియన్ నాయకులు, అసోసియేషన్, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ, ఆరోగ్యంగా ఉండడం జీవనశైలిలో భాగం కావాలన్నారు. వాకింగ్ చేయడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎన్టీపీసీ ఉన్నతాధికారులు ప్రసేన్‌జిత్‌పాల్, ప్రోజ్, పీకే.లాడ్, ఏకే దేశాయ్, బీకే సిక్దర్, సీఎంవో డాక్టర్ ఐఆర్ లహరి, ఫిజీషియన్ డాక్టర్ అరవింద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపసర్పంచ్‌ను తొలగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు

పాలకుర్తి(రామగుండం): మండలంలోని బామ్లానాయక్‌తండా ఉప సర్పంచ్ బదావత్ జ్యోతిని పదవి నుంచి తొలగిస్తూ కలెక్టర్ సంగీత ఉత్తర్వులు జారీచేశారు. ఉపసర్పంచ్ జ్యోతిపై అవిశ్వాసం ప్రకటిస్తూ వార్డు సభ్యులు ఫిబ్రవరిలో కలెక్టర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో గతనెల 14న పెద్దపల్లి ఆర్డీవో సమక్షంలో బామ్లానాయక్‌తండా గ్రామ పంచాయతీ కార్యాలయంలో అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టగా మెజార్టీ వార్డుసభ్యులు అవిశ్వాసానికి మద్దతుగా ఓటు వేశారు. దీంతో అవిశ్వాసం నెగ్గినట్లు అధికారులు ప్రకటించగా గురువారం బదావత్ జ్యోతిని పదవి నుంచి తొలగిస్తున్నట్లు కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా ప్రస్తుతం గ్రామ అభివృద్ధి పనుల నిమిత్తం ఇన్‌చార్జి ఉపసర్పంచ్‌గా 7వ వార్డు సభ్యుడు ఇస్లావత్ తిరుపతిని మెజార్టీ సభ్యుల ఆమోదం మేరకు ఎన్నుకున్నట్లు సర్పంచ్ బదావత్ రాజునాయక్ తెలిపారు.

సుల్తాన్‌పూర్‌కు జాతీయ అవార్డు



సుల్తాన్‌పూర్ పంచాయతీ కార్యాలయం

ఎలిగేడు(పెద్దపల్లి): మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ పంచాయతీ సతత్ వికాస్ పురస్కారం వరించినట్లు కలెక్టర్ సంగీత సత్యనారాయణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జాతీయ పంచాయతీ అవార్డ్స్‌లో భాగంగా దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ పంచాయతీ సతత్ వికాస్ పురస్కారం కింద 27 గ్రామపంచాయతీలకు అవార్డులు ప్రకటిస్తే, అందులో తెలంగాణకు 8 రావడం, అందులో సుల్తాన్‌పూర్ ఉండటం మనందరికీ గర్వకారణమని కలెక్టర్ పేర్కొన్నారు. సుల్తాన్‌పూర్ పంచాయతీ జాతీయస్థాయిలో క్లీన్ అండ్ గ్రీన్ పంచాయతీ విభాగంలో 3వ స్థానంలో నిలిచిందని, దీని కోసం కృషి చేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలకు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని పేర్కొన్నారు.

గుండెపోటుతో సింగరేణి కార్మికుడి మృతి



రాజిరెడ్డి మృతదేహం

గోదావరిఖని(రామగుండం): సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–2 పరిధి ఓసీపీ–3లో కేబుల్‌బాయ్‌గా పనిచేస్తున్న గొట్టిముక్కుల చిన్నరాజిరెడ్డి(55) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందాడు. రెండో షిఫ్టులో కేబుల్‌బాయ్ గా విధులు నిర్వహిస్తున్న క్రమంలో ఛాతీలో నొప్పితో కుప్పకూలి పోయాడు. క్వారీ నుంచి ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

ఆస్తిపన్నుకు ఆఫర్..!

- మున్సిపాలిటీల్లో ఎర్లీబర్డ్..
- ముందస్తు చెల్లించేవారికి అవకాశం
- ఈనెల 30లోపు చెల్లిస్తే ఐదు శాతం రాయితీ
- జిల్లాలోని నాలుగు బల్దియాల్లో 'అడ్వాన్స్'పై దృష్టి

రామగుండం బల్దియాకు ఎర్లీబర్డ్ ఆఫర్ ద్వారా వచ్చిన ఆదాయం	
2019-20	రూ.82.82లక్షలు
2020-21	రూ.1.13కోట్లు
2021-22	రూ.1.14కోట్లు
2022-23	రూ.1.50కోట్లు



రామగుండం కార్పొరేషన్ కార్యాలయం

కోల్‌సిటీ(రామగుండం): మున్సిపాటీల్లో ముందస్తు ఆస్తి పన్ను చెల్లించేవారికి రాష్ట్ర ప్రభుత్వం రాయితీ కల్పించింది. ఇందుకోసం ఎర్లీబర్డ్ ఆఫర్‌ను ప్రవేశపెట్టింది. ఈనెల ఒకటో తేదీ నుంచి ఈ స్కీం అమల్లోకి వచ్చింది. జిల్లాలోని రామగుండం నగర పాలకసంస్థతోపాటు పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాటీల్లో ఎర్లీబర్డ్ ఆఫర్‌పై అధికారులు దృష్టి పెట్టారు. 2023–24కు సంబంధించిన ఆస్తి పన్ను ఈనెల 30లోగా చెల్లిస్తే 5 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఆఫర్ ద్వారా సాధ్యమైనంత వరకు ఆస్తిపన్ను వసూలు చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఆశించినస్థాయిలో రాని ఆస్తిపన్ను..

రామగుండం కార్పొరేషన్‌లో 2022–23లో ఆశించిన స్థాయిలో ఆస్తిపన్ను వసూలు కాలేదు. రూ.11.49 కోట్ల డిమాండ్ ఉండగా.. ఆర్థిక సంవత్సరం ముగిసేసరికి రూ.7.49 కోట్లు వసూలు చేసి 66 శాతానికే పరిమితమైంది. తాగునీటి పన్ను రూ.7.68 కోట్ల వరకు డిమాండ్ ఉండగా.. రూ.2.30 కోట్లు తక్కువగా వసూలై 33 శాతంగా నమోదైంది. అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించినా ఆశించి నస్థాయిలో ఆస్తిపన్ను వసూలు కాలేదు.



రామగుండం నగరంలో ఎర్లీబర్డ్‌పై ఫ్లెక్సీతో ప్రచారం

టార్గెట్ రూ.2.5కోట్లు

ఆస్తి పన్నును ముందస్తుగా చెల్లించేలా ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయడంపై అధికారులు దృష్టి సారించారు. రూ.11.49కోట్ల డిమాండ్‌గా పెట్టుకున్నారు. అదే సమయంలో బకాయిదారులకు ఎర్లీబర్డ్ ఆఫర్ వర్తించదని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. ఫలితంగా రామగుండం నగర పాలక సంస్థ రూ.2.50 కోట్ల వరకు ఎర్లీబర్డ్ ఆఫర్ ద్వారా ముందస్తు ఆస్తిపన్ను వసూలు చేయించాలని అధికారులు టార్గెట్ పెట్టుకున్నారు.

ఆఫర్ వినియోగించుకోండి



ముందస్తు ఆస్తి పన్ను చెల్లింపులో ఐదు శాతం రాయితీని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. ఎర్లీబర్డ్ రాయితీ గడువు ఈనెల 30 వరకు ఉంది. ఎర్లీబర్డ్ ఆఫర్‌పై మైకులు, ఫ్లెక్సీల ద్వారా ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. బిల్ కలెక్టర్లకు కూడా ముందస్తు ఆస్తి పన్ను చెల్లింపులపై టార్గెట్ విధిస్తాం.
– బి.సుమన్‌రావు, కార్పొరేషన్ కమిషనర్



అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న సంజయ్, నాయకులు

ప్రివిలేజ్ కమిటీ ఎదుట నిలబెడతా

- కరీంనగర్ పోలీసుల తీరుపై మండిపడ్డ బండి
- కోర్టుకు సైతం ఈడుస్తానని ప్రతిన
- కర్మ జరుగుతున్న ఇంట్లో విధ్వంసం సృష్టించారని ఆక్రోశం
- సంజయ్ విడుదలతో బీజేపీలో ఉత్సాహం
- భారీ ఊరేగింపు, గజమాలలతో సత్కారం
- జైలు పరిసరాల్లో 144వ సెక్షన్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/కరీంనగర్ క్రైం/ కరీంనగర్‌టౌన్: ఇటీవల మరణించిన తన అత్తమ్మ కర్మ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన తనతో దురుసుగా వ్యవహరించిన కరీంనగర్ పోలీసులను పార్లమెంటు ప్రివిలేజ్ కమిటీ ఎదుట నిలబెడతానని ఎంపీ బండి సంజయ్ అన్నారు. పదో తరగతి పేపర్ లీకేజీ కుట్రలో ఆరోపణలు ఎదుర్కొంటున్న కేసులో కరీంనగర్ జైల్లో రిమాండ్‌లో ఉన్న ఆయన శుక్రవారం ఉదయం బెయిల్‌పై విడుదలయ్యారు. అనంతరం బండి పోలీసులు, ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తన అత్తమ్మ మరణిస్తే.. తొమ్మిదవ రోజు (కర్మ) కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన తనని ఎలాంటి నోటీసులు లేకుండా అరెస్టు చేయడంపై మండిపడ్డారు. ఎలాంటి నోటీసులు, వారెంట్లు లేకుండా చట్టవిరుద్ధంగా కనీసం పార్లమెంటు సభ్యుడిని అన్న గౌరవం లేకుండా దురుసుగా అరెస్టు చేశారని ఆరోపించారు. ఇంట్లో తన అత్తమ్మ కార్యక్రమం కోసం తెచ్చిన సామగ్రి, టెంట్లు చిందరవందర చేశారన్నారు. తనను గంటలకొద్దీ జీపుల్లో తిప్పి వరంగల్ పోలీసులకు అప్పగించినందుకు కరీంనగర్ పోలీసులను ప్రివిలేజ్ కమిటీ ఎదుట నిలబెడతానన్నారు. వీలుంటే కోర్టుకు కూడా ఈడుస్తానని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కరీంనగర్‌లో హై అలర్ట్

→ బండి సంజయ్ విడుదల నేపథ్యంలో.. కరీంనగర్‌లో హై అలర్ట్ నెలకొంది. పదోతరగతి పేపర్ లీకేజీ కేసులో అరెస్టయిన భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ శుక్రవారం జైలు నుంచి ఉదయం 9.02 గంటలకు విడుదలయ్యారు.

→ జైలు పరిసర ప్రాంతాల్లో 144వ సెక్షన్ అమలు చేయడంతో మీడియా మినహా కార్యకర్తలెవరినీ జైలువద్దకు అనుమతించలేదు. కేవలం నలుగురైదుగురు ముఖ్య నాయకులు మాత్రమే జైలు వద్దకు చేరుకున్నారు.

→ బండి విడుదల సందర్భంగా జైలుకు దారి తీసే రోడ్లన్నీ పోలీసులు భారీకేడ్లతో మూసివేశారు. జైలు నుంచి బయటకు వచ్చిన సంజయ్ మొదటి మీడియాతో మాట్లాడారు. అనంతరం నేరుగా మహాలక్ష్మి దేవాలయానికి చేరుకొని అమ్మవార్లను దర్శించుకున్నారు. అక్కడి నుంచి సంజయ్ అత్తగారింటికి వెళ్లారు.

→ ఇటీవల సంజయ్ అత్తమ్మ చిట్ల వనజ మృతిచెందగా ఆమె ఫొటోకు పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబసభ్యులతో కొద్దిసేపు మాట్లాడారు. సంజయ్ జైలు నుంచి విడుదలైన విషయం తెలుసుకొని జిల్లా నలుమూలల నుంచి కార్యకర్తలు సంజయ్ వద్దకు చేరుకున్నారు.

→ జ్యోతినగర్‌లోని సంజయ్ అత్తమ్మ ఇల్లు కార్యకర్తలతో కిక్కిరిసిపోయింది. అక్కడి నుంచి కార్యకర్తలతో కలిసి భారీ ఊరేగింపుగా కోర్టు చౌరస్తాకు చేరుకున్నారు. అప్పటికే సంజయ్ కోర్టు చౌరస్తాకు వస్తారనే విషయం తెలుసుకుని భారీగా కార్యకర్తలు చేరుకున్నారు.

→ కార్యకర్తల కోలాహలం మధ్య అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అక్కడే క్రేన్ ఏర్పాటు చేసి సంజయ్‌ను భారీ గజమాలతో సత్కరించారు. కోర్టు చౌరస్తా నుంచి రేకుర్తి రాజశ్రీ గార్డెన్ వెళ్లే క్రమంలో భారీ ఊరేగింపుతో సంజయ్ ఎస్ఆర్ఆర్ కళాశాల వరకు పాదయాత్ర నిర్వహించారు.

→ రేకుర్తి చౌరస్తాలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి సైతం పూలమాల వేసి నివాళి అర్పించి, రాజశ్రీగార్డెన్‌కు చేరుకొని కార్యకర్తలతో మాట్లాడారు. సాయంత్రం 3.30 గంటలకు బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్‌చుగ్ సంజయ్ అత్తమ్మ ఇంటికి చేరుకొని వనజ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించడంతోపాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అక్కడే 4 గంటలకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

→ బండి సంజయ్ జైలు నుంచి ఇంటికి వచ్చిన అనంతరం బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్ చుగ్ బండి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బండి సంజయ్ తల్లి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా 'మీరు బాధపడాల్సిన పనిలేదు, మీ కొడుకు వారియర్ అని అభివర్ణించారు.

→ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ విడుదల అనంతరం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అడిషనల్ డీసీపీలు శ్రీనివాస్, చంద్రమోహన్, ఏసీపీలు తుల శ్రీనివాస్‌రావు, కరుణాకర్‌రావు, విజయ్‌కుమార్, సీఐలు, ఎస్సైలు గట్టి బందోబస్తు నిర్వహించారు.

→ మాజీ ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా బీజేపీ ఇన్‌చార్జి ఎస్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, వాసుదేవారెడ్డి, బీజేపీ పార్లమెంట్ అధ్యక్షుడు బోయిన్‌పల్లి ప్రవీణ్‌రావు, జిల్లా మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణరావు, నాయకులు కటుకం లోకేశ్, పుల్లెల పవన్‌కుమార్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండోవిడత గొర్రెల పంపిణీకి ఏర్పాట్లు చేయండి

- కలెక్టర్ సంగీత

సాక్షి, పెద్దపల్లి: రెండో విడత గొర్రెల పంపిణీకి అవసరమైన ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ సంగీత అన్నారు. గురువారం రాత్రి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పథకం అమలుకు అనుసరించాల్సిన విధి విధానాల గురించి వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్‌తో సమావేశం నిర్వహించారు. జిల్లా పరిధిలోని 10,789 మంది లబ్ధిదారులకు గొర్రెల పంపిణీ అమలు జరిగేలా సన్నద్ధం కావాలని అధికారులకు సూచించారు. పశు వైద్యాధికారి రోజూ తన పరిధిలోని రెండు గ్రామాల్లో గొర్రెల పెంపకందారుల, సహకార సంఘ సభ్యులు, లబ్ధిదారులతో సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. లబ్ధిదారుల కుల ధ్రువీకరణ, బ్యాంక్ ఖాతా, ఆధార్, నామినీ ఆధార్ జిరాక్స్ కాపీలతో పాటు అవసరమున్న పత్రాలను సంబంధిత పశు వైద్యాధికారులు సేకరించి జిల్లా పశువైద్య, పశు సంవర్ధక శాఖాధికారి కార్యాలయంలో అందించాలన్నారు. లబ్ధిదారు వాటా కింద రూ.43,750 వారి వర్చువల్ అకౌంట్‌లో జమ చేయాలని సూచించారు. 1,110 మంది లబ్ధిదారులు తమ వాటా డబ్బులు జమ చేశారని, వారు డాక్యుమెంట్లను రెండు రోజుల్లోగా పశువైద్య అధికారికి సమర్పించాలని, చెల్లించనివారు వెంటనే సమర్పించాలని ఆదేశించారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సంగీత

మరణించిన వారి స్థానంలో నామినీలకు..

గొర్రెల పంపిణీ రెండో విడత ఎంపికైన వారిలో 409 మంది మరణించినట్లు ప్రాథమిక పరిశీలనలో గుర్తించారని వారి స్థానంలో నామినీలకు యూనిట్ అందించడం జరుగుతుందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వి.లక్ష్మీనారాయణ, పశు వైద్య, పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వి.రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే బీఆర్‌ఎస్‌కు బలం

- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్

కమాన్‌పూర్(మంథని): బీఆర్‌ఎస్ పార్టీకి కార్యకర్తలే బలం బలగం అని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీఆదివరహస్వామి కల్యాణమండపంలో శుక్రవారం నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మంథని నియోజకవర్గంలో పార్టీ మరింత బలంగా ఉండాలంటే గ్రామ స్థాయిలో సమ్మేళాలను ఏర్పాటు చేసి సమస్యలను తెలుసుకొని పరిష్కంచుకునేందుకు అందురూ కలిసికట్టుగా ఐక్యతతో ఉండాలన్నారు. బీఆర్‌ఎస్ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రతి ఇంటికి వెళ్లి తెలియజేస్తే మళ్లీ పార్టీకే అధికారం వస్తుందన్నారు. రాష్ట్ర మెడికల్ కార్పొరేషన్ చైర్మన్, ఆత్మీయ సమ్మేళన జిల్లా ఇన్‌చార్జి ఎర్రోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక బడుగు, బలహీన వర్గాలకు స్వతంత్రం వచ్చిందన్నారు. అనంతరం కాంగ్రెస్ నాయకుడు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలానికి చెందిన కర్రు నాగయ్య మంత్రి, జెడ్పీ చైర్మన్ పుట్ట మధు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. మండల అధ్యక్షుడు పిన్‌రెడ్డి కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పెద్దపల్లి, భూపాలపల్లి జెడ్పీ చైర్మన్లు పుట్ట మధు, జక్కు శ్రీహర్షిణి, ఎంపీపీ రాసకొండ లక్ష్మి, ఏఎంసీ, పీఏసీఎస్ చైర్మన్లు దాసరి రాయలింగు, ఇనగంటి భాస్కర్‌రావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు. అంతకముందు మంత్రి ఆదివరహస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.



సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి ఈశ్వర్

చెక్కులు పంపిణీ

మండలంలోని రొంపికుంట గ్రామానికి చెందిన గుండేటి రమేష్‌కు రూ.2లక్షల 50 వేలు, అముల్లా ఖాన్‌కు రూ.15 వేలు, పాలకుర్తి మండలం కన్నాల గ్రామానికి చెందిన హరికకు రూ.18వేలు, సాయికుమార్‌కు రూ.12వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరు కాగా బాధిత కుటుంబాలకు మంత్రి పంపిణీ చేశారు.

సింగరేణి ప్రైవేటీకరణపై జంగ్ సైరన్

- ప్రధాని పర్యటన నేపథ్యంలో కోల్‌బెల్ట్ ప్రాంతంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మహాధర్నా
- పార్టీ అధిష్టానం ఆదేశాలతో గోదావరిఖనిలో విస్తృత ఏర్పాట్లు
- కోల్‌బెల్ట్ నేతలకు ఫోన్‌లో దిశానిర్దేశం చేసిన సీఎం



సాక్షి, పెద్దపల్లి: ప్రధాని మోదీ హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో కోల్‌బెల్ట్ ప్రాంతంలో మహాధర్నాకు బీఆర్‌ఎస్ పార్టీ సిద్ధమవుతోంది. సింగరేణి బొగ్గగనుల వేలం వేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయానికి వ్యతిరేకంగా కోల్‌బెల్టు ప్రాంతాల్లో 'మహా ధర్నాలతో' జంగ్ సైరన్ మోగించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తుంది. ఇందులో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బొగ్గ గనులకు నిలయమైన గోదావరిఖనిలో శనివారం సింగరేణి కార్మికులు, కార్మికసంఘాల నేతలు, మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, పార్టీ శ్రేణులతో మహాధర్నా నిర్వహించనున్నారు. జెడ్పీ చైర్మన్ పుట్టమధు భూపాలపల్లి జిల్లాలో నిర్వహించే మహాధర్నాలో పాల్గొననున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ప్రజాక్షేత్రంలో బీజేపీకి గుణపాఠం చెప్పేలా మహాధర్నా విజయవంతం చేసేందుకు శ్రేణులు సమాయత్తం అవుతున్నాయి.

కోల్‌బెల్టు నేతలకు సీఎం ఫోన్..!

సింగరేణి సమస్య కేవలం ఆరు జిల్లాల సమస్య కాదని, తెలంగాణ ఆర్థిక ప్రగతిని దెబ్బతీసే కుట్రలో భాగంగానే బొగ్గ గనుల వేలంకు కేంద్రం యత్నిస్తుందని ఇప్పటికే బీఆర్‌ఎస్ అధిష్టానం పోరుబాటను ఎంచుకుంది. దీనిలో భాగంగా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గత గురువారం మహాధర్నాకు సంబంధించి కేటీఆర్ సింగరేణి పరిధిలోని పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలతో మాట్లాడగా, శనివారం నిర్వహించే నిరసన కార్యక్రమాలపై శుక్రవారం సీఎంవో కార్యాలయం నుంచి సీఎం కేసీఆర్ ఫోన్‌లో దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. దీంతో గోదావరిఖనిలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే కోరుకంటి చందర్ బీఆర్‌ఎస్ శ్రేణులతో సమావేశమై మార్గనిర్దేశం చేశారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు గోదవరిఖని ప్రధాన చౌరస్తాలో నిర్వహించే మహాధర్నాకు కార్మికులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.



భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రై డే

జిల్లావ్యాప్తంగా క్రిష్టియన్లు శుక్రవారం గుడ్‌ఫ్రై డే వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయమే ఆయా ప్రాంతాల్లోని చర్చిలకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జిల్లా కేంద్రంలోని క్రిష్టియన్‌కాలనీలో గల బెథెల్ చర్చిలో పాస్టర్లు బైబిల్‌లోని సారాంశాలను వివరించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



క్లుప్తంగా

ఆయన చూపు సజీవం


ప్రభాకర్(ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ: ఆయన మరణించిన మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు ప్రసాదించారు. తండ్రిని కోల్పోయిన పుట్టెడు దు:ఖంలో కూడా కుటుంబసభ్యులు సమాజహితం కోసం ఐ బ్యాంక్‌కు నేత్రదానంచేసి ఆదర్శంగా నిలిచారు. రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీకి చెందిన కోల ప్రభాకర్ మాజీ సింగరేణి కార్మికుడు శుక్రవారం హఠాన్మరణం చెందాడు. దీంతో ఆయన కళ్లను దానం చేయడానికి కుటుంబ సభ్యులు అంగీకరించడంతో సదాశయ ఫౌండేషన్ సభ్యులు నేత్రాలను సేకరించి ఎల్‌వీ. ప్రసాద్ ఆస్పత్రికి పంపించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు భార్య శంకుతల, కూతురు సౌజన్య, అల్లుడు రాజశేఖర్‌ను సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు శ్రావణ్‌కుమార్, లింగమూర్తి, రవీందర్, దేవేందర్, రాజన్న, రాజమౌళి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు రాజేందర్, త్రివేది అభినందించారు.

మినీ డీజిల్ ట్యాంకర్ బోల్తా


అదుపుతప్పి బోల్తా పడిన డీజిల్ ట్యాంకర్

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని నర్సయ్యపల్లి శివారు రాజీవ్ రహదారి పక్కనున్న కల్వర్టులో శుక్రవారం అదుపుతప్పి మినీ డీజిల్ ట్యాంకర్ బోల్తాపడింది. కరీంనగర్ నుంచి డీజిల్‌తో పెద్దపల్లి మండలంలోని రాఘవాపూర్ వద్దనున్న ఓ ఫ్యాక్టరీకి డీజిల్ తీసుకెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. డ్రైవర్‌కు ఎలాంటి ప్రమాదం జరగలేదు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు

రామగిరి(మంథని): ముత్తారం మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదుట గల స్పీడ్ బ్రేకర్ల వద్ద బైక్ అదుపుతప్పి వాహనం నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. ముత్తారం మండలంలోని ఓడేడ్ పంచాయతీ పరిధి వెంకటేశ్వర్లపల్లికి చెందిన సుంచు రమేశ్ బైక్‌పై కేశనపల్లి వైపువస్తుండగా పోలీస్‌స్టేషన్ ఎదుట ప్రధాన రహదారిపై ఉన్న స్పీడ్ బ్రేకర్ల వద్ద బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. ఈక్రమంలో సమీపంలోని భారీ కేడ్లను బలంగా ఢీకొనడంతో తలకు, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన పోలీసులు అంబులెన్స్‌లో మంథనిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

‘చెల్లింపులపై శ్వేతపత్రం విడుదల చేయాలి’

గోదావరిఖని: ఆర్‌ఎఫ్‌సీఎల్ బాధితుల చెల్లింపులపై శ్వేతపత్రం విడుదల చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి కె.విశ్వనాథ్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉద్యోగ బాధితుల్లో ప్రాణాలు పోగొట్టుకున్న ముంజ హరీష్ కుటుంబానికి నేటి వరకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందలేదన్నారు. అఖిలపక్షం పేరుతో కొంతమంది చేస్తున్న ఈ తతంగాన్ని రామగుండం పారిశ్రామిక ప్రాంత ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. సమావేశంలో జూపాక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఐదు నిమిషాల్లోనే అనంత లోకాలకు

- కారు ప్రమాదంలో యువ కార్మికుడు బలి
- విషాదం నింపిన డ్రంకెన్‌డ్రైవ్
- సీరియస్‌గా తీసుకున్న పోలీసులు


శరత్‌కుమార్(ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ: ఇంట్లోంచి బయలుదేరిన ఐదునిముషాలకే అనంత లోకాలకు వెళ్లాడు. మద్యంమత్తులో ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ రాంగ్ రూట్‌లో వచ్చిన కారు ఢీకొట్టడంతో డ్యూటీకి వెళ్తున్న యువ కార్మికుడు అక్కడికక్కడే మృతిచెందిన ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనను గోదావరిఖని టూటౌన్ పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. గోదావరిఖని టూటౌన్ సీఐ వేణుగోపాల్ కథనం ప్రకారం.. స్థానిక పోతనకాలనీలో నివసిస్తూ జీడీకే-11గనిలో ట్రెయినీ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న మామిడి శరత్‌కుమార్(27) గురువారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. నాలుగేళ్ల క్రితం ఉద్యోగంలో చేరిన శరత్ మృతితో కుటుంబ సభ్యుల కొండంత ఆశలు ఆవిరయ్యాయి. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం కొత్తపల్లికి చెందిన మామిడి రాజయ్య-శాంతమ్మ దంపతులు రోజువారి కూలీలుగా పనిచేస్తూ జీవిస్తున్నారు. వారికి ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. కొడుకును ఐటీఐలో ఎలక్ట్రీషియన్ చదివించారు. నాలుగేళ్ల క్రితం సింగరేణి సంస్థ నిర్వహించిన రాతపరీక్షలో ఎలక్ట్రీషియన్ ఉద్యోగం సాధించాడు. ఉద్యోగరిత్యా అవివాహితుడైన శరత్‌కుమార్ ఒంటరిగా పోతన కాలనీ బ్లాక్‌నంబర్ 55-759 క్వార్టర్‌లో ఉంటున్నాడు. గురువారం నైట్ డ్యూటీలో భాగంగా పోతనకాలనీ నుంచి 11గనిలో విధులు నిర్వహించేందుకు తన స్కూటీపై వెళ్తున్నాడు. పోతన కాలనీ బ్రిడ్జి సమీపంలోకి రాగానే యైటింక్లయిన్ కాలనీ నుంచి పోతనకాలనీ వైపు మద్యంమత్తులో అతివేగం, అజాగ్రత్తగా రాంగ్‌రూట్‌లో వచ్చిన సంజీవ్ కారుతో శరత్‌ను ఢీకొట్టాడు. దీంతో శరత్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ప్రమాదానికి ముందు స్థానిక తెలంగాణా చౌరస్తాలో కూడా రాంగ్‌రూట్‌లో అతివేగంగా డ్రైవ్‌చేస్తూ వెళ్లడంతో ఇద్దరు, ముగ్గురు తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. ఇదే చౌరస్తాలో జ్యూస్‌సెంటర్ వలీయొద్దీన్ బైక్‌ను ఢీకొట్టాడు. అంతటితో ఆపకుండా అదే స్పీడ్‌తో పోతనకాలనీ వైపు డ్రైవింగ్ చేస్తూ రెండు ప్రమాదాలకు కారణమయ్యాడు. ఇతని తీరుపై స్థానికులు తీవ్రంగా మండిపడుతున్నారు. మృతుడి తండ్రి మామిడి రాజయ్య ఇచ్చిన ఫిర్యాదుతో హత్యానేరముగా పరిగణించి సంజీవ్‌పై పలు కేసులు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరాలు వెల్లడించారు.


పోలీసుల అదుపులో నిందితుడు సంజీవ్


ప్రమాదానికి కారణమైన కారు

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రచారం చేయండి

- ఆత్మీయ సమ్మేనంలో ఎర్రోళ్ల శ్రీనివాస్

రామగిరి(మంథని): రాష్ట్రంలో టీఆర్‌ఎస్ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని వీటి గురించి గ్రామాల్లో విస్తృతంగ ప్రచారం చేయాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని రాష్ట్ర మెడికల్ కార్పోరేషన్ చైర్మన్, ఆత్మీయ సమ్మేళనం జిల్లా ఇన్‌చార్జి ఎర్రోళ్ల శ్రీనివాస్ సూచించారు. ముత్తారం మండలంలోని కాసర్లగడ్డ సమీపంలోని ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. సంక్షేమ పథకాలే రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ను అధికారంలోకి తీసుకొస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. జెండా, ఎజెండా బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా ప్రతీ ఒక్కరు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జెడ్పీ చైర్మన్ పుట్ట మధు మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలే నాబలం, నాబలగం అన్నారు. నిరంతరం ప్రజల మధ్యే ఉంటూ అభివృద్ధికి కృషిచేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో చోటుచేసుకున్న అభివృద్ధి నాటికి, నేటికి సాక్ష్యంగా నిలుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జక్కుల ముత్తయ్య, జెడ్పీటీసీ చెల్కల స్వర్ణలత, వైస్ ఎంపీపీ సుధాటి రవీందర్‌రావు, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పోతుపెద్ది కిషన్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు పప్పు స్వరూప, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

తండ్రి నెలమాసికం... తెల్లారే కొడుకు మృతి

- నెలరోజుల వ్యవధిలో తండ్రికొడుకులిద్దరి మృతితో కుటుంబంలో విషాదఛాయలు
- పెద్దపల్లిరోడ్డు ప్రమాదంలో చామనపల్లివాసి మృతి


అనిల్(ఫైల్)

కరీంనగర్‌రూరల్: తండ్రి నెలమాసికం నిర్వహించిన మరుసటిరోజే కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో తీరని విషాదం నింపింది. నెలరోజుల వ్యవధిలో తండ్రికొడుకులిద్దరూ మరణించడంతో కుటుంబమంతా దు:ఖసాగరంలో మునిగింది. స్థానికుల కథనం ప్రకారం... కరీంనగర్ మండలం చామనపల్లికి చెందిన అవారి అనిల్(26) యువకుడు పెద్దపల్లిలోని ట్రాక్టర్ షోరూంలో మెకానిక్‌గా పనిచేస్తూ గది అద్దెకు తీసుకుని అక్కడే ఉంటున్నాడు. గురువారం రాత్రి 10 గంటలకు ట్రాక్టర్ గ్యారేజీ మూసివేసిన తర్వాత బైక్‌పై మరో మెకానిక్‌ను సుల్తానాబాద్‌లో దించి అనిల్ పెద్దపల్లికి తిరిగివస్తుండగా రిలయన్స్ పెట్రోల్ బంకు వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టి అక్కడికక్కడే మృతిచెందాడు. శుక్రవారం పెద్దపల్లి ప్రభుత్వాస్పత్రిలో పోస్ట్‌మార్టం నిర్వహించి అనిల్ మృతదేహాన్ని చామనపల్లికి తరలించారు. అనిల్ తండ్రి రాజయ్య నెలరోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందగా బుధవారం తండ్రి నెలమాసికం నిర్వహించిన మరుసటిరోజు గురువారం ఉదయం పెద్దపల్లికి వెళ్లిన అనిల్ రోడ్డుప్రమాదంలో మృతిచెందడంతో గ్రామంలో తీరని విషాదం నెలకొంది. నెలరోజుల వ్యవధిలో తండ్రికొడుకులిద్దరు మృతిచెందడం కుటుంబంలో అంతులేని ఆవేదనను మిగిల్చింది. తల్లి లక్ష్మి, సోదరుడు సునీల్ రోధించిన తీరు గ్రామస్తులను కంటతడి పెట్టించింది.


పెద్దపల్లిలో లారీని ఢీకొట్టి మృతిచెందిన అనిల్

నిబంధనలు పాటించని వాహనాలపై చర్యలు ..

సుల్తానాబాద్: లారీ ఇండికేటర్లు వేయకుండా రోడ్డుపై నిలపడంతో వెనుక నుంచి బైక్‌పై ఢీకొట్టడంతో అనిల్ (26) యువకుడు అక్కడికక్కడే మృతిచెందినట్లు పెద్దపల్లి ఎస్సై రాజేశ్ తెలిపారు. మృతుడి తల్లి లత ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వాహనాలపై చర్యలు తీసుకుంటామన్నారు.

వైఎస్సార్‌టీపీ కాగడాల ప్రదర్శన


కాగడాలు ప్రదర్శిస్తున్న రాజమ్మ

ధర్మారం: వైఎస్సార్‌టీపీ పిలుపుతో ధర్మారం మండలకేంద్రంలో శుక్రవారం వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజమ్మ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, మహిళలు కాగడాల ప్రదర్శననిర్వహించారు.ఈసందర్భంగా రాజమ్మ మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నల పత్రాల లీక్‌తో రాష్ట్రప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లక్ష్మి, శకుంతల, ప్రేమలత పాల్గొన్నారు.

అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు కేటాయించాలి

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్‌లో ప్రభుత్వభూమిని గుర్తించి అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి యాకయ్య డిమాండ్‌చేశారు. గతనెల 19న 2వ డివిజన్‌లో ప్రారంభమైన భూపోరాట శిబిరం 20రోజులు పూర్తయిన సందర్భంగా శిబిరాన్ని సందర్శించిన యాకయ్య స్థానికులను ద్దేశించి మాట్లాడారు. ఇళ్లస్థలాల కోసం అర్హులు దరఖాస్తులు చేసుకున్నప్పటికీ అధికారులు ఎలాంటి కార్యచరణ చేపట్టకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషిచేయాలని లేనిపక్షంలో తహసీల్దార్ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు రామాచారి, రవీందర్, దేవేంద్ర, రమణ, ఉపేందర్, సురేశ్, భాగ్య, సుజాత, నవీన్, సంపత్, గీట్ల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

మృతదేహం పరిశీలన


మృతదేహాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

సుల్తానాబాద్: పెద్దపల్లి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట గుర్తుతెలియని అనాథ శవాన్ని పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్ సాబీర్‌ఖాన్ పరిశీలించారు. నాలుగు నెలలుగా పట్టణంలో నివాసం ఉంటూ దాతలు అందిచే సాయంతో జీవిస్తోంది. మృతిచెందిన వృద్ధురాలు పూర్తి వివరాలు తెలియాల్సి వుందని, మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రిలోని పోస్టుమార్టం గదిలో భద్రపరిచామని, వివరాలకు ప్రభుత్వాసుపత్రిలో సందర్శించాలని ఆయన కోరారు.

కళాశాలలో ఘనంగా టెక్నికల్ ఈవెంట్

పెద్దపల్లిరూరల్: మదర్‌థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో కోడ్-ఏ-థాన్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ నవత జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఎంతో ప్రతిభ కనబర్చి పలు ఎమ్‌ఎన్‌సీ కంపెనీల్లో ఎంపికవడం ఆనందంగా ఉందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. పెద్దపల్లి జిల్లాలో నూతన కోర్సులు ప్రవేశపెట్టి మారుమూల ప్రాంత విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. సీఎస్‌ఈ విభాగధిపతి బూర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. భవిష్యత్‌లో అవకాశాలకు తగ్గట్టుగా నైపుణ్యం పెంపొందించుకోవాలని, జీవితంలో స్థిరపడాలంటే లక్ష్యంతో ముందుకుసాగాలని సూచించారు. ఇంజనీరింగ్ విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏవో నరేశ్, అకౌంట్ ఆఫీసర్ పవన్, సీఎస్‌ఈ డిపార్ట్‌మెంట్ రమేశ్, పద్మ, శ్రీధర్, వంశీ, సవిత, రేణుక, కిషోర్, షబానాబేగం, వివిధ విభాగ అధిపతులు పాల్గొన్నారు.


విద్యార్థులు చేస్తున్న సాంస్కృతి కార్యక్రమాల దృశ్యం

గుండెపోటుతో ఇద్దరు యువకుల మృతి

- క్రికెట్ ఆడుతూ ఒకరు.. వ్యవసాయ పనులు చేస్తూ మరొకరు


ఆంజనేయులు మృతదేహం


జీల సతీశ్(ఫైల్)

చిగురుమామిడి/గన్నేరువరం: కరీంనగర్ జిల్లాలో శుక్రవారం గుండెపోటుతో ఇద్దరు యువకులు మృతిచెందారు. క్రికెట్ ఆడుతూ ఒకరు, వ్యవసాయ పనులు చేస్తూ మరొకరు హఠాత్తుగా చనిపోవడం విషాదం నింపింది. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామానికి చెందిన శనిగరం ఆంజనేయులు(37)గ్రామపరిధిలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నీలో సమీప బంజేరుపల్లి టీం తరఫున క్రికెట్ ఆడేందుకు వెళ్లాడు. రెండు ఓవర్లు బౌలింగ్ చేశాడు. మూడో ఓవర్‌లో రెండు బాల్స్ వేసి కుప్పకూలిపోయాడు. తోటి క్రీడాకారులు ఫిట్స్ వచ్చిందనుకుని తాళం చేతుల గుత్తి చేతిలో పెట్టారు. నోటినుంచి నురగలు రావడంతో సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించేలోపే ఆంజనేయులు మృతిచెందినట్లు తెలిపారు. ఆంజనేయులు కట్టుమిషన్ కుడుతూ జీవనం సాగించేవాడు. ఇతడికి భార్య ధనలక్ష్మి, తల్లి మల్లవ్వ ఉన్నారు. కాగా, హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఆంజనేయులు మృతదేహాన్ని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ సందర్శించి నివాళి అర్పించారు. మృతుల కుటుంబసభ్యులకు ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. అదే విధంగా గన్నేరువరం మండలం సాంబయ్యపల్లె గ్రామానికి చెందిన జీల సతీశ్(32)తనకున్న పొలంలో వివిధ పంటలు సాగుచేస్తూ, ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శుక్రవారం మొక్కజొన్న పంటకు నీళ్లు పారించేందుకు వెళ్తుండగా పొలానికి సమీపంలో గుండెపోటు రావడంతో కిందపడపోయాడు. అటుగా వెళ్తున్న రైతులు గమనించి స్థానిక వైద్యుడి వద్దకుతీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య కవిత, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

బొగ్గుబాయి వార్తలు

సింగరేణి సెగ మోదీకి తాకేలా మహాధర్నా


సమావేశంలో మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

- రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్

గోదావరిఖని: ప్రధాని మోదీకి సింగరేణి సెగ తగిలేలా మహాధర్నా నిర్వహించాలని రాష్ట్రమంత్రి కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి స్థానిక ప్రధానచౌరస్తా సమీపంలోని టీబీజీకేఎస్ కేంద్ర కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణిని పూర్తిగా ప్రైవేటీకరించి, చేతులు దులుపుకోవాలని చూస్తోందని, సింగరేణి ప్రైవేటీకరణను నిలిపివేయాలని సీఎం కేసీఆర్ కేంద్రానికి అనేకమార్లు విజ్ఞప్తి చేసినా, కుట్రపూరితంగా వ్యవరిస్తోందన్నారు. మార్చి 29 నుంచి మే30 వరకు గనులకు వేలం ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వేలంతో సంబంధం లేకుండా సింగరేణికి నేరుగా బొగ్గు గనులను కేటాయించాలన్నారు. సింగరేణి ప్రైవేటీకరణను రాష్ట్రప్రభుత్వం తరఫున, సింగరేణి కార్మికుల పక్షాన తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా శనివారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో చేపట్టే యుద్ధభేరి మహాధర్నా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మేయర్ అనిల్‌కుమార్ టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య, నాయకులు కన్నూరి సతీశ్‌కుమార్ బాదావత్ శంకర్‌నాయక్ కుమ్మరి శ్రీనివాస్, ఎన్వీ రమణారెడ్డి కల్వచర్ల కృష్ణవేణి, గండ్ర దామోదర్ రావు, జాహిద్‌పాషా, అచ్చెవేణు, చెలకపల్లి శ్రీనివాస్, దేవ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

నేడు టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో మహాధర్నా


ఏఎల్పీలో కార్మికులతో మాట్లాడుతున్న శంకరయ్య

రామగిరి(మంథని): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న బొగ్గుబ్లాకుల ప్రైవేటీకరణ విధానాలను ఎండగడుతూ సింగరేణి కార్మికుల సెగ మోదీకి తగిలేలా ప్రధానమంత్రి రాష్ట్ర పర్యటనను వ్యతిరేకిస్తూ నేడు సింగరేణి సంస్థ ఆర్జీ3, ఏపీఏ ఏరియాల్లో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్, టీబీజీకేఎస్ మహాధర్నా కోసం ఇచ్చిన పిలుపుతో శుక్రవారం ఏపీఏ పరిధిలోని అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్ట్ (ఏఎల్పీ)లో కార్మికులను కలిసి మాట్లాడారు. గోదావరిఖని ప్రధానచౌరస్తాలో నిర్వహించే మహాధర్నాలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆసంఘం గని పిట్‌సెక్రటరీ దాసరి మల్లేశ్, నాయకులు శంకర్, రమేశ్, దుగ్యాల నరేశ్, మహేశ్, సతీశ్, గోపి, క్రాంతియాదవ్, రమేశ్, ఉప్పు రాజు, రాజయ్య కార్మికులు పాల్గొన్నారు.

తృణధాన్యాలకు ప్రాధాన్యమివ్వాలి

- హెల్త్‌ఆఫీసర్ డాక్టర్ సుమన్



మాట్లాడుతున్న సింగరేణి హెల్త్‌ఆఫీసర్ సుమన్

గోదావరిఖని: మారుతున్న కాలానికి అనుగుణంగా ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకుని తృణధ్యాన్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సింగరేణి హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సుమన్ పేర్కొన్నారు. శుక్రవారం ఆర్జీ-1 జీఎం కార్యాలయం ఆవరణలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. శాఖాహారం, పండ్లు ఎక్కువగా తీసుకోవాలన్నారు. తాజా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, తృణధాన్యాలు వినియోగించాలన్నారు. రోజు అరగంట పాటు నడక, యోగ, స్విమ్మింగ్, సైక్లింగ్ చేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని దీంతో ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు గండ్ర దామోదర్ రావు, సీఎంవోఏఐ అధ్యక్షుడు పానుగోటి శ్రీనివాస్, ఎస్‌వోటూ జీఎం రాంమోహన్, డీజీఎం పర్సనల్ సీహెచ్.లక్ష్మీనారాయణ, ఎన్విరాన్‌మెంట్ అధికారి ఆంజనేయప్రసాద్, సీనియర్ సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి, పర్సనల్ మేనేజర్ సలీం, సీనియర్ పర్సనల్ అధికారి బంగారు సారంగపాణి, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సీఎస్సార్ నిధులు

రామగిరి(మంథని): రామగిరి, మంథని పోలీస్‌స్టేషన్ల పరిధిలో సీసీ కెమెరా ఏర్పాటుకు సింగరేణి యాజమాన్యం (సీఎస్సార్) నిధులు రూ.15 లక్షలు కేటాయించింది. రామగిరి, మంథని పోలీస్‌స్టేషన్ల పరిధిలో నిత్యం చోటు చేసుకుంటున్న ప్రమాదాలు, చోరీకేసులను చేదించడానికి సీసీ కెమెరాల ఆవశ్యకతపై మంథని సీఐ సతీశ్ సింగరేణి యాజమాన్యానికి లేఖ రాశారు. స్పందించిన యాజమాన్యం సీసీ కెమెరా ఏర్పాటుకు రూ.15 లక్షల నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఈమేరకు త్వరలో నే రామగిరి, మంథని పోలీస్‌స్టేషన్లపరిధిలోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయనున్నారు.

జేబీసీసీఐ ఒప్పందాలను పూర్తిచేయాలి

- బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య


గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సత్తయ్య

గోదావరిఖని: జేబీసీసీఐ సమావేశంలో అలవెన్స్‌ల ఒప్పందాలను వెంటనే పూర్తి చేయాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్‌చేశారు. శుక్రవారం జీడీకే-1, జీడీకే-11గనులపై ఏర్పాటుచేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. బీఎంఎస్ కృషితో బొగ్గుగని కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం జరిగిందన్నారు. ఇదే క్రమంలో అలవెన్స్ విషయంలో కూడా ఒప్పందాన్ని త్వరగా పూర్తిచేయాలన్నారు. ఒప్పందం విషయంలో యాజమాన్యం, కోలిండియా స్పందించి ఒప్పందం చేయాలని డిమాండ్ చేశారు. బేసిక్‌పై ఆధారపడి పెరిగే అండర్ గ్రౌండ్ అలవెన్సులు, స్పెషల్ అలవెన్స్, హెచ్‌ఆర్‌ఏ కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ట్రాన్స్‌పోర్టు, నైట్‌షిఫ్ట్ అలవెన్స్ ఇతర అలవెన్సులు తదుపరి సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సకాలంలో ఒప్పందం పూర్తిచేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు ఆకుల హరిణ్, సారంగపాణి, మాదాసు రవీందర్, బోడకుంట రాజేశం తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ నుంచి తొలగించడం సరికాదు

- ఉపాధ్యాయురాలిని విధుల నుంచి తొలగించడంపై పునఃపరిశీలించాలి

పెద్దపల్లిరూరల్: పదోతరగతి వార్షిక పరీక్షల్లో హిందీ పేపర్ లీకేజీకి బాధ్యులుగా చేస్తూ సబియా మదహత్ అనే ఉపాధ్యాయురాలిని సర్వీస్ నుంచి తొలగించడం సరికాదని అఫ్జల్ మోహిఉద్దీన్ (ఎంఈఎస్ఏ) పెద్దపల్లి జిల్లా ప్రధాన బాధ్యులు అన్నారు. శుక్రవారం మీసా జనరల్ బాడి సమావేశం ఎంబీగార్డెన్‌లో నిర్వహించి మాట్లాడారు. ఓవ్యక్తి భద్రత సిబ్బంది కనుగప్పి చెట్టెక్కి గోడ దూకి మొదటి అంతస్తులోని తరగతి గది కిటికీ వద్దకు చేరుకుని రహస్యంగా పేపర్ ఫోటోతీసి వాట్సాప్‌లో ఇతరులకు చేరవేయడం ఇన్విజిలేటర్ తప్పిదం కాదని ప్రభుత్వం ఉపాధ్యాయురాలని సర్వీస్ నుంచి తొలగించడం అత్యంత పెద్ద శిక్ష విధించడమేనన్నారు. ఈ విషయన్నాఇ ప్రభుత్వం పునఃపరిశీలనచేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మేష(ఎంఈఎస్ఏ)కు చెందిన అధ్యక్షుడు అఫ్జల్ మోహిద్దీన్, ప్రధానకార్యదర్శి అబ్దుల్‌ఖాదర్, హనరీ ప్రెసిడెంట్ లతీఫ్, అహ్మద్, వజాహత్ అలీ, వైస్‌ప్రెసిడెంట్ గులం ముస్తఫా, వహీద్‌ఖాన్, అశ్ఫేక్ తదితరులు పాల్గొన్నారు.